# ఉత్తమ సలహా

లక్ష్మీపతి నిన్న మొన్నటి వరకు అతి సామాన్యుడు. ఓ ప్రైవేటు ఫరంలో గుమాస్తాగిరీ చేస్తూ, భార్య, ఇద్దరు పిల్లల్తో గుట్టుగా సంసార రథాన్ని లాక్కుంటున్న మనిషి. ఆడంబరాలకు, అనవసరపు ఖర్చులకు బహు దూరంగా ఉంటాడు.

అలాంటి లక్ష్మీపతి హఠాత్తుగా పాతిక లక్షలకు అధిపతి అయ్యాడు. అరవై మూడు గజాల్లో కట్టిన ఇంట్లో అద్దెకుంటున్న లక్ష్మీపతి లంకెల బింద లేం దొరక లేదు. లాటరీ టిక్కెట్ల జోలికే పోడు. ఓ ఉత్తమ సలహాకు ప్రభుత్వం నుండి పారితోషికంగా పాతికలక్షలు అందుకున్నాడు లక్ష్మీపతి. ఆర్థికంగా గట్టి ఆలంబన దొరకటమే కాకుండా, బోలెడంత గుర్తింపు, ప్రజాదరణ, ప్రభుత్వాదరణ పొందేడు.

పేపర్లన్నింటిలో అతని ఫోటోతోపాటు, అతని జీవిత సంగ్రహం కూడా ప్రచురించారు. దూరదర్శన్‌లో అతన్ని గురించిన వివరాలు వెల్లడించారు. ఇంటర్వ్యూలు, సన్మానాలు, సత్కారాలు.

ఎప్పుడు సెలవు అడిగినా అతి కష్టంగా అంగీకరించే ఆఫీసు యాజమాన్యం వారు, లక్ష్మీపతిని ఆఫీసులో ఘనంగా సత్కరించి, నెల రోజుల ప్రత్యేక సెలవు మంజూరు చేశారు.

బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, సహోద్యోగులు, ప్రజలు, ప్రభువులు - అందరి దగ్గర్నుంచీ శుభాకాంక్షలే!

ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన మన ప్రభుత్వం, అందులోంచి బయట పడేందుకు ఆచరణ సాధ్యమైన, అందరికీ (ముఖ్యంగా ప్రజానీకానికి) ఆమోద యోగ్యమైన సూచనను ఇవ్వవలసిందిగా ప్రకటించింది. అన్నింటిలోకీ ఉత్తమమైన, ఉదాత్తమైన, ఉచితమైన, ప్రజలకు అదనపు భారం కానటువంటి,

అమలు చేసేందుకు ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బందీ (ప్రజల నుండి) ఎదురు కానటువంటి సలహాకు పాతిక లక్షలు బహుమానం కూడా ప్రకటించింది.

లక్షల మంది అనేకానేక సూచనలను పంపించారు ప్రభుత్వం వారికి. అధికార బృందాన్ని ఏర్పాటు చేసి వచ్చిన సలహా లన్నింటినీ పరిశీలించి నచ్చిన దాన్ని ఎన్నుకోమన్నది ప్రభుత్వం.

ఉత్తమమైన సలహాను ఎంపికచేసే కర్తవ్యాన్ని కూడా ప్రజలకే అప్పగిస్తే తమను నిందించరనుకున్న సర్కారువారు, చివరగా ఓ నిర్ణయానికి వచ్చారు.

అధికార బృందం వారు, వచ్చిన సలహాలన్నింటిలోనూ, ఉత్తమంగా అనిపించిన ఓ పదింటిని మాత్రం పేపర్లదారా, రేడియోల ద్వారా, దూరదర్శన్‌ల ద్వారా ప్రజలకు తెలియజేసి, ఎక్కువమంది ఏ సలహాను ఉత్తమంగా నిర్ణయిస్తారో, దాన్నే తుది తీర్పుగా అంగీకరించాలన్న ప్రతిపాదన చేశారు.

అలా ప్రకటించిన పాతిక సలహాల్లోనూ అత్యధికంగా దాదాపు నూటికి తొంభై మంది లక్ష్మీపతి సలహానే ఉత్తమమైందిగా తెలియజేశారు. ఒక రకంగా చెప్పాలంటే లక్ష్మీపతి సలహాను ప్రజానీకం ఏకగ్రీవంగా ఎంపిక చేసింది.

చెప్పిన ప్రకారం, ప్రజానీకం తీర్పునే తుదితీర్పుగా భావించిన ప్రభుత్వం వారు ప్రకటించిన విధంగా పాతిక లక్షల రూపాయల పారితోషికాన్ని లక్ష్మీపతికి అందజేశారు. అంతేకాదు, ఆ మొత్తం పై ఎటువంటి ఆదాయపు పన్నూ విధించమంటూ ఉత్తర్వులు కూడా జారీ చేశారు.

నిజం చెప్పాలంటే లక్ష్మీపతికి ప్రభుత్వం వారి నుంచి వచ్చిన పాతిక లక్షల రూపాయల నగదు బహుమతికి తోడు అనేక ప్రజా సంఘాల నుంచీ, వ్యాపారవేత్తల నుంచీ, సామాన్య ప్రజానీకం నుంచీ కూడా బోలెడన్ని బహుమతులు, బ్యాంకు చెక్కులు, వగైరా వగైరా. ఆ వగైరాలన్నింటి విలువ హీనపక్షం అయిదారు లక్షల వరకూ ఉంటుంది.

వీటన్నింటినీ మించి అతి సామాన్యుడైన లక్ష్మీపతి ప్రముఖుడై పోయాడు. ప్రశంసలందుకున్నాడు.

ఇంతకీ లక్ష్మీపతి సూచించిన సలహా ఏమిటో చెప్పనే లేదు కదూ? దానికి ఇంకో కథ ఉంది.

ఎప్పట్నుంచో తన మీద సరదాగా ఓ కథ రాయమని అడుగుతున్నాడు నా సహోద్యోగి లక్ష్మీపతి.

ఎందుకో ఇలా రాయాలనిపించి, ఇంతవరకు రాసి లక్ష్మీపతికి చూపించాను.

కథ చదువుతున్నంతసేపూ అనిర్వచనీయమైన అనుభూతికి లోనయ్యాడతను. అతని కళ్లల్లో కనిపించిన వెలుగు, ముఖంలో కాంతి, పెదవుల మధ్యన కదలాడే చిరునవ్వు ఆ విషయాన్ని తెలియజేస్తున్నయ్.

"నిజంగా అలా జరిగితే ఎంత బాగుండు!"

అమాయకంగా అన్నాడు లక్ష్మీపతి

నవ్వి ఊరుకున్నాను నేను.

"ఇంతకీ నే చెప్పిన... అదే చెప్పవలసిన ఆ అత్యుత్తమ సలహా ఏమిటో చెప్పనే లేదు...?" సందేహం వెలిబుచ్చాడు లక్ష్మీపతి.

"అది నీదెలా అవుతుంది. నిజానికి నాది కదూ? ఉడికించా నతన్ని.

"నిజానికి నీది. కథ కోసం నాది సరేనా?" ఉక్రోషంగా అన్నాడు లక్ష్మీపతి.

"సరే చెప్తున్నా విను నీ సలహా... కథలోనే సుమా! నిజాని కది నాదేను మళ్లీ చెప్తున్నాను" అన్న నా వైపు విసురుగా చూశాడు లక్ష్మీపతి. "సర్సరే...విను..ఏం లేదోయ్! ఇంగ్లీషులో అయితే స్కాములు, తెలుగులో అయితే కుంభకోణాలు అనుకో. వీటితో సంబంధమున్న ప్రముఖులెందర్నో కటకటాల వెనక్కి పంపుతున్నారు కదా వారందరికీ తప్పనిసరిగా బెయిలు మంజూరు చేయాలి. కానీ అలా బెయిలు మంజూరు చేయటానికి కట్ట వలసిన పూచీకత్తు సొమ్మును కనీస మొత్తం అరకోటి రూపాయలకు పెంచి, అది తిరిగి చెల్లించే పని లేకుండా ఓ ఉత్తర్వును జారీ చేస్తే చాలు. ఇక మనకు ఆర్థిక సంక్షోభం ఎక్కడుంటుంది? పైగా అమెరికా వంటి సంపన్న దేశాల క్కూడా అప్పు లివ్వగల స్థాయికి మనం ఎదగటం ఖాయం. ఇదే నీ (నా) సలహా" అంటూ ముగించాను.

"పాతిక లక్షలు వస్తే సంగతి అపుడు ఆలోచిద్దాం నీదో, నాదో, కానీ ప్రస్తుతానికి నేనో పాతిక రూపాయలు ఖర్చుపెట్టి పార్టీ ఇస్తున్నాను. పద కాఫీ హోటలుకు!" అంటూ అటుగా అడుగువేశాడు లక్ష్మీపతి సంతోషంగా. అనుసరించాన్నేను.

◆ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - **14** జులై, **1997** ◆